పాల డెయిరీలను మూలన పెట్టే చర్యలు మానుకోవాలి

విశాలాంధ్ర - రేగిడి: రాష్ట్ర ప్రభుత్వం పాల డెయిరీలను మూలన పెట్టే చర్యలు మానుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బుడితి అప్పలనాయుడు అన్నారు. శనివారం సంకిలి గ్రామంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఎన్నికలకు ముందు వ్యవసాయ అనుబంధ పరిశ్రమ అయిన పాడి పరిశ్రమను, పాడి పరిశ్రమకు మూలమైన అక్కాచెల్లెళ్లను అన్నలా ఆదుకుంటానని, లీటరు పాలకు నాలుగు రూపాయలు ఇస్తానని పాదయాత్ర సందర్భంగా ఇచ్చిన హామీ అధికారంలోకి వచ్చి నాలుగు సంవత్సరాలు అవుతున్నా నేటికీ అతి లేదు గతి లేదన్నారు. మాట తప్పను మడమ తిప్పనన్న జగన్మోహన్ రెడ్డి ఈ రాష్ట్రంలో 1964 సహకార చట్టం పరిధిలో ఏర్పడిన ఆయా జిల్లాల్లో పాల డెయిరీలను డెయిరీలకు అనుబంధంగా లక్షలాది కుటుంబాల ప్రధాన జీవన ఆధారంగా సాగిన సంస్థ కార్యకలాపాల వల్ల వేలకోట్ల రూపాయల స్థిరాస్తులు కలిగి ఉన్న పాల డెయిరీలను 1995 నాటి కంపెనీ చట్టంలోకి వస్తుందని, గుజరాత్ రాష్ట్రంలో నష్టాల ఊబిలో కూరుకుపోయిన అమూల్ సంస్థను కాపాడడం కోసం మన రాష్ట్రంలో ఉన్న సహకారంగా వ్యవస్థలను నష్టపెడుతూ తీసుకుంటున్న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి వైఖరిని ప్రజలందరూ గుర్తించాలని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి గత పాదయాత్ర సందర్భంగా ముఖ్యమంత్రి ఇచ్చిన మాట ప్రకారం లీటర్ పాలకు నాలుగు రూపాయల ప్రోత్సాహకం, పశువుల పెంపకాన్ని ప్రోత్సహించడానికి 70 శాతం రాయితీతో దాణా ఇవ్వాలని పేర్కొన్నారు.

జాతీయ లోక్ అదాలత్‌లో 1447 కేసులు పరిష్కారం

విశాలాంధ్ర - బొబ్బిలి: సత్వర న్యాయానికి కక్షిదారులు జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి మండల న్యాయ సేవా సంస్థ చైర్మన్ టి.వాసుదేవన్ పిలుపునిచ్చారు. స్థానిక కోర్టులో శనివారం మండల న్యాయ సేవా సంస్థ చైర్మన్ సీనియర్ సివిల్ జడ్జి టి.వాసుదేవన్, న్యాయవాది పోతుల మురళీకృష్ణలు బెంచిగా వ్యవహ రించారు. రెండో బెంచిగా ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎం.సరో జినమ్మ, న్యాయవాది పెంట జగన్నాథం, మూడో బెంచిగా అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి జె.సౌమ్య జోష్ని, న్యాయవాది సిహెచ్ఎల్వి ప్రసన్న కుమార్‌ల ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌కు విశేష స్పందన లభించింది. జాతీయ లోక్ అదాలత్‌లో ప్రామిసరీ నోట్లు ఆరు కేసుల ద్వారా 31 లక్షల పదివేల 250 రూపాయలు స్టాంపు డ్యూటీ ప్రభుత్వానికి వచ్చింది. పార్టిషన్ కేసు ఒకటి, టైటిల్ కేసులు రెండు, ఈపీ రెండు కేసులు ద్వారా ద్వారా రెండు లక్షల 79 వేల 786 రూపాయలు స్టాంపు డ్యూటీ, చెక్ బౌన్స్ ద్వారా 80 వేల రూపాయలు, పోలీస్ కేసులో 34, మనోవర్తి కేసు ఒకటి, అడ్మిషన్ కేసులు 8, సెకండ్ క్లాస్ కోర్టు ద్వారా 1377 కేసులు ద్వారా ఐదు లక్షల 40 వేల రూపాయలు స్టాంపు డ్యూటీ, ప్రీ లిటిగేషన్ 15 కేసులు ద్వారా 38 లక్షల 54 వేల 900 రూపాయలు స్టాంపు డ్యూటీ, బ్యాంకుల ద్వారా ప్రోనోట్ కేసులు రెండు పరిష్కారమైనట్లు విలేకరులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు గంటి గోపాలకృష్ణశర్మ, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ మేనేజర్ బద్రి నాగేశ్వరరావు, ఇండియన్ బ్యాంక్ మేనేజర్ ప్రవీణ్ కుమార్, బ్యాంక్ ఆఫ్ బరోడా అసిస్టెంట్ మేనేజర్ భాస్కర్ రావు పాల్గొన్నారు.

యువతకు పౌష్టికాహారం పంపిణీ

విశాలాంధ్ర - చీపురుపల్లి: తల్లిదండ్రులు మజ్జి అప్పారావు, సూర్యం జ్ఞాపకార్థం యువతకు ఆశయ సంస్థ ద్వారా ఆంధ్రప్రదేశ్ హైకోర్టు సీనియర్ న్యాయవాది మజ్జి సూరిబాబు పౌష్టికాహారాన్ని అందించారు. ప్రభుత్వ కళాశాల గ్రౌండ్ ఆవరణలో వివిధ సెలక్షన్స్ కోసం శిక్షణ తీసుకుంటున్న యువతకు పౌష్టికాహారాన్ని అందజేశారు. ఆశయ సంస్థ అధ్యక్షులు రెడ్డి రమణ చేస్తున్న సామాజిక సేవలను గుర్తించిన మజ్జి సూరిబాబు తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కోచ్ బి.నవీన్ యువత పాల్గొన్నారు.

బ్రిజ్ భూషణ్‌ను వెంటనే అరెస్టు చేయాలి

విశాలాంధ్ర - బొబ్బిలి: భారతీయ మహిళా రెజ్లర్లపై లైంగిక దాడికి పాల్పడిన మతోన్మాద బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్‌ను తక్షణమే అరెస్ట్ చేయాలని వామపక్ష ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక ఇందిరాగాంధీ డిగ్రీ కళాశాలలో వామపక్ష, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, యువజన, కార్మిక, విద్యార్థి సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో భారతీయ మహిళా రెజ్లర్లకు మద్దతుగా యూటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.విజయగౌరి, యూటీఎఫ్ జిల్లా సహాధ్యక్షులు ప్రసన్నకుమార్‌ల అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రముఖ కోచ్ రావు శ్రీనివాసరావు మాట్లాడుతూ క్రీడారంగాన్ని ప్రోత్సహించే పరిస్థితులు కనుమరుగ వుతున్నాయని అన్నారు. లైంగిక వేధింపులకు పాల్పడిన బ్రిజ్ భూషణ్‌ను అరెస్టు చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పరుగుల రాణి పి.టి.ఉష కూడా ఇటువంటి చర్యలను ఖండించక పోగా సపోర్ట్ చేయడాన్ని తీవ్రంగా తప్పు పట్టారు. విజయగౌరి మాట్లాడుతూ భేటీ బచావో..భేటీ పడావో అని చెప్పే ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ మాటలు ఒట్టి మాటలేనని వారి మంత్రి నిరూపించారని అన్నారు. క్రీడారంగంలో మహిళా క్రీడాకారిణిలకు ప్రత్యేక అకాడమీ ఏర్పాటు చేసి మహిళలనే గౌరవ అధ్యక్షుల స్థానాలలో నియమించాలని అన్నారు. అధికారంలో ఉన్నవారు ఎటువంటి పనులైనా చేయవచ్చు అని గర్వంగా వ్యవహరిస్తుందని ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రటరీ మునకాల శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ నాయకులు మువ్వల శ్రీనివాసరావు, ఏఐకేఎంఎస్ నాయకులు లక్ష్మణరావు అన్నారు. మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపుల దాడిని ఖండిస్తూ ఈ నెల 16వ తేదీన 3కే వాక్ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తీర్మానం చేసారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు సురేష్ కుమార్, ఎస్ఎఫ్ఐ నాయకులు మణికుమార్, తైక్వాండో శిక్షణా కోచ్ బంకురు ప్రసాద్, షటిల్ బాడ్మింటన్ కోచ్ బాబా, యూటీఎఫ్ నాయకులు రమేష్, రామకృష్ణ పాల్గొన్నారు.

రాజీ చేసుకున్న ఇద్దరూ విజయం సాధించినట్టే..

విశాలాంధ్ర - శృంగవరపుకోట: రాజీయే రాజమార్గమని, కోర్టు కేసులో రాజీ చేసుకున్న కక్షిదారులు ఇద్దరూ విజయం సాధించినట్టేనని ఎస్.కోట జూనియర్ సివిల్ జడ్జి సబ్బవరపు వాణి అన్నారు. ఎస్.కోట కోర్టులో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో సివిల్ దావాలు-13, చెక్ బౌన్స్ కేసులు (ఎన్.ఐ యాక్ట్)-13, ఈపీలు-03, క్రిమినల్ కేసులు-07, పెట్టీ కేసులు-377 (సెకెండ్ క్లాస్ కోర్టు) మొత్తం 413 కేసులను న్యాయమూర్తి వాణి పరిష్కరించారు. ముందుగా న్యాయమూర్తి వాణి మాట్లాడుతూ రాజీ పడదగిన క్రిమినల్, సివిల్ కేసులతో పాటు మనోవర్తి వంటి కేసులు పరిష్కరించేందుకు కక్షిదారులు ముందుకు రావాలని కోరారు. లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కారం కావడం వల్ల కక్షిదారుల్లో ఇరువర్గాలు విజయం సాధించినట్లు అవుతుందన్నారు. లోక్ అదాలత్ ద్వారా ఇచ్చిన తీర్పులకు అప్పీలు తీసుకునే అధికారం లేదని వివరించారు. అందువల్ల కక్షిదారులు, అర్జీదారులు ఈ సదావకాశాన్ని ఎప్పటికప్పుడు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అల్లు సత్యాజీ మాట్లాడుతూ సుప్రీంకోర్టు సూచనలు మేరకు నిర్వహిస్తున్న లోక్ అదాలత్ వలన కోర్టుల్లో పేరుకుపోయిన పెండింగ్ కేసులను సులువుగా పరిష్కరించే అవకాశం ఉంటుందని, తద్వారా కక్షిదారులకు విలువైన సమయంతో పాటు ధనం కూడా ఆదా అవుతుందని గుర్తు చేశారు. ఇక వరుసగా నిర్వహిస్తున్న లోక్ అదాలత్ ద్వారా ఎస్.కోట జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో వందల కేసులు పరిష్కరించబడ్డాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీపీ వి.కేశవరావు, బార్ అసోసియేషన్ కార్యదర్శి డబ్ల్యు.ఎన్. శర్మ, న్యాయవాదులు నానిగిరి తులసీదాసు, బి.త్రిమూర్తులు, మామిడి చంద్రశేఖర్, టీవీఎస్ సన్యాసిరావు, వారాది ఈశ్వరరావు, జి.చిట్టిబాబు, బీవీఎస్ రామారావు, ఆర్.సత్యనారాయణ, టీవీఆర్ మూర్తి, ఎం.అప్పారావు, బి.సత్యనారాయణ, ఎం.అనూరాధ, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటకలో కాంగ్రెస్ గెలుపు దేశాభివృద్ధికి నాంది

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: కాంగ్రెస్ పార్టీ కర్ణాటక ఎన్నికలలో ఘన విజయం సాధించడం దేశానికి చారిత్రాత్మక మలుపు తిప్పడానికి నాంది పలికిందని డీసీసీ అధ్యక్షులు సరగడ రమేష్ కుమార్ అన్నారు. జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యాలయంలో శనివారం కర్ణాటక రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ గెలుపు విజయోత్సవ వేడుకలు నగర పార్టీ అధ్యక్షులు సుంకరి సతీష్ ఆధ్వర్యంలో జరిగాయి. ఈ కార్యక్రమానికి విచ్చేసిన డీసీసీ అధ్యక్షులు సరగడ రమేష్ కుమార్ మాట్లాడుతూ దేశ ప్రజలందరూ కాంగ్రెస్ పార్టీ వైపు చూస్తున్నారని అన్నారు. ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే ఆధ్వర్యంలో యువ నాయకులు రాహుల్ గాంధీ నేతృత్వంలో రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీ దేశవ్యాప్తంగా అధికారంలోకి రాబోతుందన్నారు. భావి భారత ప్రధాని రాహుల్ గాంధీ అయి, ప్రజల ఆర్థిక కష్టాలు అతి త్వరలో తీరుస్తాడని కొనియాడారు. మతతత్వ బీజేపీని ఇంటికి పంపించడానికి దేశ ప్రజలంతా సిద్ధంగా ఉన్నారనడానికి కర్ణాటక కాంగ్రెస్ విజయమే నిదర్శనమని తెలిపారు. కర్ణాటకలో కాంగ్రెస్ గెలవడం ఈ ప్రభావం ఆంధ్రాలో కూడా కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం గిడుగు రుద్రరాజు నేతృత్వంలో కచ్చితంగా వస్తుందని తెలిపారు. అనంతరం కర్ణాటక కాంగ్రెస్ విజయాన్ని హర్షిస్తూ కార్యకర్తలందరికీ మిఠాయిలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ స్టేట్ వైస్ చైర్మన్ షరీఫ్, జిల్లా మైనార్టీ సెల్ చైర్మన్ రెహ్మాన్, జిల్లా బీసీ సెల్ చైర్మన్ సిహెచ్ శ్రీనివాసరావు, డీసీసీ సెక్రటరీ చంద్రశేఖర్, రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భవనాల ప్రారంభోత్సవంలో మంత్రి బొత్స

విశాలాంధ్ర - చీపురుపల్లి: కోటి 10 లక్షల రూపాయల వ్యయంతో కేజీబీవీ ఇంటర్మీడియట్ అదనపు తరగతులను, సచివాలయం-1 నూతన భవన ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో మంత్రి బొత్స సత్యనారాయణ పాల్గొన్నారు. మండల కేంద్రంలో కోటి 10 లక్షల రూపాయల వ్యయంతో కేజీబీవీ అదనపు తరగతులను, అగ్రహారం, ఆకులపేట, మెట్ట కాలనీ పరిధిలో చీపురుపల్లి సచివాలయం - 1 నూతన భవనాన్ని ప్రారంభోత్సవం చేశారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, విజయనగరం పార్లమెంట్ సభ్యులు బెల్లాన చంద్రశేఖర్, ఎంపీపీ ఇప్పిలి వెంకట నరసమ్మ, జెడ్పీటీసీ వలిరెడ్డి శిరీష, మండల నాయకులు ఇప్పిలి అనంత్, వలిరెడ్డి శ్రీనివాస్ నాయుడు, చీపురుపల్లి మేజర్ పంచాయతీ సర్పంచ్ సుధారాణి శ్రీనివాస్, వైస్ సర్పంచ్ బెల్లాన శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

విజయనగరం కోటలో యోగోత్సవం

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: సామరస్య జీవన విధానంలో యోగా ప్రాముఖ్యతను, ఆవశ్యకతను తెలియజేస్తూ.. విస్తృత ప్రచారం కల్పించడమే లక్ష్యంగా ఆయుష్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో మొరార్జీ దేశాయ్ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ యోగా, గీతం విశ్వవిద్యాలయం సౌజన్యంతో శనివారం ఉదయం విజయనగరం కోటలో యోగోత్సవం నిర్వహించారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని 100 రోజుల కౌంట్ డౌన్ ప్రక్రియలో భాగంగా చారిత్రాత్మక కట్టడమైన విజయనగరం కోటలో చేపట్టిన ప్రత్యేక కార్యక్రమంలో జిల్లాలోని పలు సంస్థలు, ప్రభుత్వ విభాగాల నుంచి పాఠశాలల నుంచి సుమారు 1,000 మంది పాల్గొని యోగ గురువుల సమక్షంలో ప్రత్యేక సాధన చేశారు. ఇంకా 39 రోజులు ఉన్న నేపథ్యంలో యోగా ఫర్ హార్మోనియస్ లివింగ్ థీమ్‌తో చేపట్టిన కార్యక్రమానికి స్థానిక ప్రజల నుంచి మంచి స్పందన లభించింది. ఈ సందర్భంగా గీతం యూనివర్సిటీ అప్లైయిడ్ సైకాలజీ విభాగాధిపతి, ప్రొఫెసర్ కె.సునీత మాట్లాడుతూ యోగా ప్రాశస్త్యాన్ని, ప్రయోజనాలను వివరించారు. శారీరకంగా, మానసికంగా ధృడంగా తయారయ్యేందుకు యోగా ఎంతగానో దోహదపడుతుందని పేర్కొన్నారు. యోగాను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు ఏటా జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామని గుర్తు చేశారు. యోగా కాన్షియస్‌నెస్ ట్రస్ట్ అధ్యక్షులు టిఎల్ నరసింహారావు, గీతం యూనివర్సిటీలో ప్రొఫెసర్ బి. నళిని, ఎం.ఆర్. డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సూర్యకాంతి, పోలీసు శిక్షణ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆనందబాబు, సత్య గ్రూపు విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ ఎం.శశిభూషణరావు యోగా ప్రయోజనాలను వివరించారు. జిల్లాకు చెందిన అధికారులు, మాన్సాస్ ట్రస్ట్, యోగా కాన్షియస్‌నెస్ ట్రస్ట్, బుద్ధ యోగా ఫౌండేషన్, ఎంవీజీఆర్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్, సీతం, రఘు, లెండి ఇంజినీరింగ్ కాలేజీలు, రామా స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ విద్యార్థులు, పోలీస్ ట్రైనింగ్ కళాశాల శిక్షకులు, అధికారులు, స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

పులి సంచారం పట్ల అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర - తెర్లాం/బాడంగి: బాడంగి మండలం గ్రామ సమీప పంచాయతీల్లో మళ్లీ పులి సంచరిస్తున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆకులకట్ట సర్పంచ్ ఉయ్యాల సత్యనారాయణ సూచించారు. ఆకులకట్టతో పాటు మధుర గ్రామం దాటి వెంకయ్యపేటా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గ్రామంలో దండోరా వేయించారు.

జీవో నెం.1 రద్దు హర్షనీయం

విశాలాంధ్ర - రామభద్రపురం: వైసీపీ ప్రభుత్వం తీసుకువచ్చిన చీకటి జీవో నెంబర్ 1ను హైకోర్టు రద్దు చేయడం చాలా హర్షనీయమని బొబ్బిలి టీడీపీ ఇన్‌చార్జి బేబీ నాయన అన్నారు. శనివారం మండల టీడీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వానికి కోర్టులో ఎన్ని ఎదురు దెబ్బలు తగిలినా సిగ్గు రావడంలేదని ఆరోపించారు. నాలుగు సంవత్సరాల కాలంలో ప్రభుత్వం ప్రజలకు ఏమి చేయలేదని అన్నారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా టీడీపీ అధికారంలోకి రావడం, చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అవ్వడం ఖాయమని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి, శ్రీకాకుళం నియోజకవర్గ పరిశీలకులు చింతల రామకృష్ణ, మాజీ ఎంపీటీసీ కె.వెంకటి తదితరులు పాల్గొన్నారు.

పబ్లికేషన్

మహారాజశ్రీ బొబ్బిలి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జికోర్టు వారి దివ్యసముఖమునకు
E.P. 21 In A.C.P 208/2019
బిట్వీన్:
బొబ్బిలి చిట్స్ ప్రైవేట్ లిమిటెడ్, బొబ్బిలి
..డిహెచ్ఆర్
ఎండ్:
గోపీనాథ్ కునార్ ...జెడిఆర్ నెం.1
ఆర్.నెం.1
గోపినాథ్ కునార్ తండ్రి తన్ ఖాథర్ కుమార్, వయస్సు 46 సం.లు, క్వా నెం.ఎ/21, న్యూ రైల్వే కాలనీ, టిట్లఘర్, బాలానగిర్, ఒడిస్సా స్టేట్, డబ్ల్యు/ఎ ఎస్ మెన్‌టైనర్, ఇ.నెం.53109491636, ఈస్ట్‌కోస్ట్ రైల్వే, టిట్లఘర్ స్టేషన్, సంబల్‌పూర్ డివిజన్, ఒడిస్సా
పై నెంబరు అమలులో యిందలి రెస్పాండెంటు నెం.1 పై సొమ్ము రాబట్టే నిమిత్తం అమలు దాఖలు చేసియున్నాము. సదరు అమలు వాయిదా తేది. 18-07-2023కి వాయిదా అయి వున్నది. సదరు వాయిదా దినం పై కోర్టులో ఉదయం 10.30 గం.లకు స్వయంగా గాని వకీలు ద్వారా గాని హైకోర్టులో హాజరు కావలెయును లేని యెడల మీ పరోక్షమందు తీర్మాణించబడునని యిందుమూలంగా తెలియజేయడమైనది.
బై ఆర్డర్
బొబ్బిలి
తే:11.05.2023
కండాపు ప్రసాదరావు,
డీహెచ్ఆర్ తరపు
అడ్వకేట్, బొబ్బిలి

మొక్కజొన్న కొనుగోలుపై కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి కూరంగి మన్మధరావు

విశాలాంధ్ర - పార్వతీపురం: మన్యం జిల్లాలో కొమరాడ, కురుపాం, సాలూరు, మక్కువ, పాలకొండ, పాచిపెంట తదితర మండలాల్లో మొక్కజొన్న పండిస్తున్న రైతుల ఇబ్బందులను గుర్తించి వారి పంటల కొనుగోలు కోసం జిల్లా కలెక్టర్ ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కూరంగి మన్మధరావు, జిల్లా సహాయ కార్యదర్శి తోట జీవన్నలు విజ్ఞప్తి చేశారు. పలు మండలాల్లో సీపీఐ నేతలు మొక్కజొన్న పంటను పరిశీలించగా రైతుల ఆవేదన వ్యక్తం చేశారన్నారు. దళారుల ప్రమేయంతో తీవ్రంగా నష్టోతున్నారని తెలిపారు. దీనిపై జిల్లాలోని అన్ని మండలాల వ్యవసాయ అధికారులకు తగు సూచనలు ఇచ్చి రైతుల మొక్కజొన్న పంటలను కొనుగోలు చేయడంపై దృష్టి సారించాలని సూచించారు. కొనుగోలు కేంద్రాలు కూడా ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు గరుగుబిల్లి సూరయ్య, కుండంగి లింగరాజు, జిల్లా సమితి సభ్యులు పువ్వుల ప్రసాద్, పత్తిక మోహనరావు, తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల ఆరోగ్యంపై పర్యవేక్షణ అవసరం

విశాలాంధ్ర - బెలగాం: చిన్నారుల ఆరోగ్యంపై పర్యవేక్షణ అవసరమని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి (డిఐఒ) డాక్టర్ టి.జగన్మోహనరావు సూచించారు. ఈ మేరకు ఆయన మురగడాం గ్రామాన్ని శనివారం సందర్శించి వైద్య సిబ్బంది నిర్వహించిన పిల్లల వ్యాధి నిరోధక టీకా కార్యక్రమాన్ని పరిశీలించారు. టీకా కార్డులో తేదీలను పరిశీలించి తదుపరి టీకా గడువు తేదీలను ఖచ్చితంగా నమోదు చేయాలని సిబ్బందికి ఆదేశించారు. వేసవి రీత్యా టీకా బాక్స్‌లో శీతోష్ణస్థితి తగు విధంగా ఉండేలా జాగ్రత్త పడాలని, త్వరగా టీకా నిర్వహణ ప్రారంభించాలని సూచించారు. ఈ సందర్భంగా డీఐఓ చిన్నారికి టీకా వేశారు. అనంతరం అంగన్వాడీ కేంద్రంలో పిల్లల ఆరోగ్య పర్యవేక్షణ చేసి, రికార్డులు పరిశీలించారు. వైద్య సిబ్బంది, స్థానికులతో సమీక్ష జరిపి పిల్లల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించి, వారి ఆరోగ్యంపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ అవసరమని తెలిపారు. ఆహార నియమాలు సక్రమంగా పాటించేలా చూడాలని, పిల్లలకు తరచుగా నీరు త్రాగించాలని, వైద్య సిబ్బంది సూచించిన కొన్ని అత్యవసర మందులు ఇంటి వద్ద ఉంచాలని మొదలగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ సర్పంచ్ ఆర్.లక్ష్మణరావు, వైద్య సిబ్బంది సోనియా, ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి వేతనదారులతో మమేకమవుతున్న ఉదయభాను

విశాలాంధ్ర - పార్వతీపురం: నియోజక వర్గంలోని పార్వతీపురం, సీతానగరం, బలిజిపేట మండలాల్లోని అన్ని గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనుల కూలీలతో నియోజకవర్గ టీడీపీ సీనియర్ నాయకులు గర్భాపు ఉదయభాను మమేకమై పలు అంశాలపై ముచ్చటిస్తున్నారు. వారి సమస్యలను తెలుసుకొంటున్నారు. ఉపాధి హామీ పథకంకు ఇంకా మంచిరోజులు రావాలంటే టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడును ముఖ్యమంత్రిగా చేయడానికి మద్దతివ్వాలని కోరుతూ వారికి వేసవితాపాన్ని తగ్గించే టాటా గ్లోకోజ్‌లను కూడా అందజేస్తున్నారు. గత నాలుగేళ్లుగా నియోజక వర్గంలోని అన్ని గ్రామాల్లోని జరిగే ఉపాధి హామీ పథకం పనులు వద్దకు రోజుకు మూడు గ్రామాల చొప్పున వెళ్లి టిడిపికు మద్దతు ఇవ్వాలని కోరుతూ తాను ముమ్మరంగా ప్రచారం చేస్తున్నట్లు తెలిపారు. వ్యవసాయరంగంలో ఉన్నత విద్యను అభ్యసించి, సుదీర్ఘ కాలంగా వ్యవసాయ అధికారిగా పనిచేసిన ఉదయభాను 2013లో తన ఉద్యోగానికి రాజీనామా చేసి గతపదేళ్లుగా రాజకీయాల్లో ఉంటున్న సంగతి తెలిసిందే. ఉదయభాను రానున్న సాధారణ ఎన్నికల్లో టీడీపీ తరుపున పోటీ చేసేందుకు ఆసక్తి కనపరుస్తున్నారు. పార్టీ అడుగుజాడల్లో నడుస్తూ, పార్టీ ఆదేశించే విధంగా పనిచేస్తానని తెలిపారు. రానున్న సాధారణ ఎన్నికలలో టిడిపి విజయం తథ్యమని, చంద్రబాబును ముఖ్యమంత్రిగా చేసేందుకు నిరంతరం కష్టపడి పనిచేస్తున్నట్లు చెప్పారు.

ప్రభుత్వ హామీలను నెరవేర్చాలి

విశాలాంధ్ర - పార్వతీపురం టౌన్: ఎన్నికల ముందు పాద యాత్రలో 104 ఉద్యోగులకు ప్రస్తుత ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ పార్వతీపురం మన్యం జిల్లా 104 యూనియన్ అధ్యక్షులు దర్రు ఆనందరావు ఆధ్వర్యంలో 104 ఉద్యోగులు ప్లకార్డుల ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 104 సేవలను గతంలో మాదిరిగా ప్రభుత్వమే నేరుగా నిర్వహించాలని, గతంలో రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీ మేరకు 104 ఉద్యోగులను కాంట్రాక్టు, లేదా ఆప్కాస్‌లలో అబ్జర్వ్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని, జీవో నెంబర్ 4459 ప్రకారం పీఎఫ్, ఈఎస్ఐ సక్రమంగా అమలు చేయాలని, ప్రతినెలా సక్రమంగా వేతనం చెల్లిస్తూ బకాయి పడ్డ వేతనాలను తక్షణమే విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు మన్మధరావు, పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు త్వరితగతిన చేపట్టాలి

విశాలాంధ్ర - సీతానగరం: జగనన్న గృహ నిర్మాణాలు వేగవంతంగా పూర్తిచేయాలని లేదంటే రద్దు చేస్తామని ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్ తెలిపారు. ప్రతీ శనివారం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు హౌసింగ్ ప్రత్యేక దినాన్ని పురస్కరించుకుని జగనన్న కాలనీలను సందర్శన చేసి లబ్ధిదారులతో మాట్లాడుతున్నట్లు తెలిపారు. శనివారం అంటిపేట పంచాయతీ వెన్నెలబుచ్చెంపేట గ్రామానికి వెళ్లి లబ్ధిదారులతో మాట్లాడారు. సత్వరమే నిర్మాణంలో ఉన్న ఇళ్లను పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ జానకీరామ్, పంచాయతీ ఉప సర్పంచ్ తిరుపతిరావు, సెక్రటరీ, ఇంజినీరింగ్ అసిస్టెంట్ తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో 130 కేసులు పరిష్కారం

విశాలాంధ్ర - కురుపాం: కురుపాం ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ డి.సౌజన్య ఆధ్వర్యంలో నిర్వహించిన కురుపాం కోర్టుకు సంబంధించిన జాతీయ లోక్ అదాలత్‌లో 130 క్రిమినల్ కేసులు పరిష్కరించారు. లోక్ అదాలత్ సభ్యులు ఎం.వెంకటరమణ, గంటా రాజ కుమార్‌లు, న్యాయవాదులు పాల్గొన్నారు.

స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం

విశాలాంధ్ర -పాలకొండ: స్థానిక శాఖా గ్రంథాలయం లో వేసవి విజ్ఞాన శిబిరంలో ఆరవ రోజు తంపటాపల్లి డ్రాయింగ్ మాష్టర్ గొర్లె మురళి పాల్గొన్నారు. మట్టితో వినాయకుని చిన్న విగ్రహం పిల్లలకు ఎలా తయారు చేయాలో వివరంగా చెప్పారు. విద్యార్థిని, విద్యార్థులు, 12 మందికి పైగా పాల్గొన్నారు. రేపటి మాతృత్వ దినోత్సవం సందర్భంగా డ్రాయింగ్ పోటీ పెట్టడం జరుగుతుందని, తల్లి యొక్క ముఖ చిత్రం చూసి వేయడం, ఎ4 సైజ్ చార్ట్ మరియు రంగులు ఎవరికి వారు తెచ్చుకోవాలని విద్యార్థులకు తెలియజేశారు. ఈ శిక్షణ లో ఇన్‌ఛార్జి గ్రంథాలయ అధికారి గణేష్ బాబు పాల్గొన్నారు.

పార్వతీపురం మన్యం

నాటుసారా పట్టివేత

విశాలాంధ్ర - పార్వతీపురం టౌన్: జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ విక్రాంత్ పాటిల్, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అడిషనల్ ఎస్పీ దిలీప్ కిరణ్ ఆదేశాల మేరకు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ యల్. ఉపేంద్ర ఆధ్వర్యంలో ఒడిషా రాష్ట్రం నుండి ఆంధ్రా ప్రాంతానికి నాటు సారా రవాణా జరుగుతుందన్న సమాచారంతో తనిఖీలు చేశారు. కొమరాడ మండలం గుమడ అగ్రహారం సమీపంలో రైల్వే బ్రిడ్జి వద్ద వాహన తనిఖీలు చేపట్టి 160 లీటర్ల నాటుసారాతో పాటు ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేశారు. కొమరాడ మండలం గుమడ గ్రామానికి చెందిన కోలా అజిత్‌ను అదుపులోకి తీసుకుని అరెస్టు చేశారు. ఈ కేసుకు సంబంధించిన ఇద్దరు వ్యక్తులు ఒడిషా రాష్ట్రానికి చెందిన నాటు సారా సరఫరాదారుడు ఉయక బాల, కొమరాడ మండలం బంజుగుప్ప గ్రామానికి చెందిన పాలక ఆనంద్ అను వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. అలాగే గత రాత్రి పార్వతీపురం మండలం వెంకంపేట గ్రామ సమీపంలో నాటు సారా అమ్ముతున్న దేవిదుర్గను అరెస్టు చేసి 40 లీటర్ల నాటు సారా టిన్నులను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసుకు సంబంధించిన నాటు సారా సరఫరాదారుడు ఒడిషా రాష్ట్రం కర్లి గ్రామానికి చెందిన జగన్ అను వ్యక్తిపై కేసు నమోదు చేసి సదరు ఇద్దరు వ్యక్తులను రిమాండ్‌కు తరలించారు. ఈ దాడుల్లో స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో ఇన్‌స్పెక్టర్ ఎల్.ఉపేంద్ర, ఎస్ఐ శేఖరం, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

పదోన్నతుల కౌన్సిలింగ్ షెడ్యూల్ విడుదల చేయాలి

విశాలాంధ్ర - బెలగాం: ఉపాధ్యాయ బదిలీల కంటే ముందుగా ఎంఈఓ, హైస్కూల్ హెచ్ఎం, డిప్యూటీ డిఈవో పోస్టులకు పదోన్నతులు కల్పించేందుకు కౌన్సిలింగ్ షెడ్యూల్‌ను విడుదల చేయాలని విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణకు లేఖ ద్వారా ప్రాతినిధ్యం చేసినట్లు ఎపి ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సామల సింహాచలం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల ఉపాధ్యాయ సంఘాలతో నిర్వహించిన సమావేశంలో దాదాపు రెండు దశాబ్దాలుగా పలు కోర్టు వివాదాలతో నిలిచిపోయిన ఎంఈఓ పోస్టులను, అదేవిధంగా గత ఏడాది కాలంగా ఆగిన హైస్కూల్ హెచ్ఎం పదోన్నతులను అమలు చేసేందుకు విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ చొరవ తీసుకోవడం ఎంతో అభినందనీయమన్నారు. ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి విద్యాశాఖలో మరింత మెరుగైన పర్యవేక్షణ కొరకు 679 ఎంఈఓ-2 పోస్టులను, 13 ఎంఈఓ-1 పోస్టులను మొత్తంగా 692 పోస్టులు మంజూరు చేశారన్నారు. వీటితోపాటు ఇప్పటికే ఖాళీగా ఉన్న దాదాపు 270 ఎంఈఓ పోస్టులు, డిప్యూటీ డిఈవో పోస్టులు 55 కలిపి దాదాపు వెయ్యి పోస్టులు పైగా పదోన్నతులను అమలు చేయాల్సి ఉందన్నారు. బదిలీల ముందే ఈ పోస్టులను భర్తీ చేస్తే కింద క్యాడర్ లో ఉన్న స్కూల్ అసిస్టెంట్లకు, ఎస్జీటీలకు ప్రయోజనం కలుగుతుందన్నారు. ఇప్పటికే ఎంఈఓ, హెచ్ఎం పోస్టుల జోనల్ సీనియారిటీ లిస్టులు విద్యాశాఖ వద్ద సిద్ధంగా ఉన్నాయన్నారు. కనుక జాప్యం లేకుండా కౌన్సెలింగ్ షెడ్యుల్ ప్రకటించాలని తమ లేఖలో మంత్రికి విజ్ఞప్తి చేసినట్లు సామల పేర్కొన్నారు.

సేంద్రియ పద్ధతిలో నవధాన్యాల సాగు మేలు

విశాలాంధ్ర - కురుపాం: సేంద్రీయ వ్యవసాయ పద్ధతిలో నవధాన్యాలు సాగు చేయడం వల్ల భూమి సారవంతమై పంటల దిగుబడి బహు బాగుగా ఉంటుందని ప్రకృతి వ్యవసాయ డివిజనల్ యాంకర్ పర్సన్ జి.అన్నపూర్ణ అన్నారు. మండలంలో రస్తా కుంటుబాయి, పొడి గ్రామాలలో శనివారం నాడు ఆర్‌బీకే పరిధిలో గల రైతులకు తొలకరి వర్షాలకు ముందుగా పంపిణీ చేయడానికి వచ్చిరొట్ట జాతులు, పప్పు ధాన్యాలు, సుగంధ ద్రవ్యాలు, చిరు ధాన్యాలు, ఆకు కూరలు, కాయ కూర, మొదలగు 10 నుండి 20 రకాలు విత్తనాలు కలిపి ఒక ఎకారానికి 10 కేజీలు చొప్పున ప్యాకింగ్ చేసి సిద్ధం చేసిన కిట్లను దగ్గరుండి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నవ ధాన్యాలను రైతులు తమ పొలాలలో వేసుకోవడం వల్ల భూమి సారవంతంతో పాటు, పశువుల దాణాకు కూడా ఉపయోగపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ మాష్టర్ ట్రైనర్ ఎ.మహేష్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది జి.తిరుపతిరావు, ఎస్. భాస్కర్‌రావు, రైతులు పాల్గొన్నారు.

విజయనగరం డీఎస్పీగా గోవిందరావు బాధ్యతలు

విశాలాంధ్ర - విజయనగరం క్రైమ్: విజయనగరం డీఎస్పీగా ఆర్.గోవిందరావు బుధవారం బాధ్యతలు చేపట్టారు. కోస్టల్ సెక్యూరిటీ విభాగంలో డీఎస్పీగా పని చేస్తున్న గోవిందరావు ఇటీవల విజయనగరం డీఎస్పీ నియమిస్తూ రాష్ట్ర డీజీపీ కేవీ రాజేంద్రనాథ్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. 1991 ఎస్ఐ బ్యాచ్‌కు చెందిన గోవిందరావు గతంలో ఎస్ఐ, సీఐగా జిల్లాలో భోగాపురం, పూసపాటిరేగ, విజయనగరం రూరల్, వన్ టౌన్, కొత్తవలస పోలీస్ స్టేషన్లో పనిచేసిన అనుభవం ఉంది.

ఏడవ రోజు 104 ఉద్యోగులు నిరసన

విశాలాంధ్ర - శృంగవరపుకోట: మండలంలోని కొట్టాం గ్రామంలో 104 వాహన ఉద్యోగులు ఏడవ రోజు శనివారం నిరసన కార్యక్రమం చేపట్టారు. 104 ఉద్యోగుల సమస్యలపై కరపత్రాలను కోటారావు, మహాలక్ష్మి ప్రదర్శించారు. సీఎం జగన్ 2019లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, జీఓ నెంబర్ 4459 ప్రకారం పీఎఫ్, ఈఎస్ఐ సక్రమంగా అమలు చేయాలని, 104 సేవలను గతంలా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల పట్ల ప్రభుత్వం చిన్న చూపు తగదన్నారు.

ఐదు కిలోల గంజాయి స్వాధీనం

విశాలాంధ్ర - విజయనగరం క్రైమ్: పట్టణంలో రైల్వే స్టేషన్ సమీపంలో ఓల్డ్ రైల్వే స్టేషన్ క్వార్టర్స్ వద్ద ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 5 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు ఒకటవ పట్టణ సీఐ బి.వెంకటరావు మంగళవారం తెలిపారు. ఈ కేసును చేదించడంలో కీలకపాత్ర పోషించిన ఎస్సైలు భాస్కరరావు, అశోక్ కుమార్ ఇతర పోలీస్ సిబ్బందిని సిఐ వెంకటరావు అభినందించారు.

తొమ్మిది గొర్రెపిల్లలు మృతి

విశాలాంధ్ర - సీతానగరం: మండలంలోని చినభోగిలి గ్రామంలో శుక్రవారం రాత్రి సాలలో ఉన్న గొర్రెపిల్లలను కుక్కలు కరిచి చంపాయి. గ్రామంలో తవుడుకు చెందిన తొమ్మిది గొర్రెలను కుక్కలు చంపిన తీరును చూసి ఆయనతో పాటు చూసిన వారంతా కన్నీళ్లు పెట్టుకున్నారు. లక్ష రూపాయల వరకు నష్టం సంభవించిందని తెలిపారు. తవుడుకు జరిగిన నష్టాన్ని అధికారుల దృష్టికి ఎమ్మెల్యే జోగారావు ద్వారా తీసుకొని వెళ్తానని సర్పంచ్ కురమాన శ్రీనివాసరావు తెలిపారు.

ఉపాధి పనులను ఎంపీడీఓ పరిశీలన

విశాలాంధ్ర - సీతానగరం: మండలంలోని కోటసీతారాంపురం, పనుకుపేట గ్రామాల్లో చెరువులు వద్ద జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను ఎంపీడీఓ ప్రసాద్‌లు శనివారం తనిఖీ నిర్వహించారు. మస్టర్లు తనిఖీలు చేసారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాల మేరకు వేతనదారులకు నిర్దేశించిన కూలీడబ్బులు వచ్చే విధంగా రెండు పూటలా పనులు చేయాలని కోరారు. కొలతలు ప్రకారం పనులు చేయాలని కోరారు. వారితోపాటు ఉపాధి హామీ పథకం మండల స్టాఫ్, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్ క్రీడాకారుల క్రాస్ కంట్రీ పరుగు

విశాలాంధ్ర - శృంగవరపుకోట: మండలంలోని ధర్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో గత 13 రోజులుగా జరుగుతున్న వేసవి బ్యాడ్మింటన్ శిక్షణా శిబిరంలో భాగంగా శనివారం రెండు కిలోమీటర్ల క్రాస్ కంట్రీ పరుగును ఫిజికల్ డైరెక్టర్ పొట్నూరు శ్రీరాములు ఆధ్వర్యంలో 75 మంది క్రీడాకారులు చేశారు. చిన్నారి క్రీడాకారులు చేస్తున్న ఈ క్రాస్ కంట్రీ పరుగు చూపరులను ఎంతగానో ఆకట్టుకుంది. ఈ క్రాస్ కంట్రీ పరుగు వలన క్రీడాకారుల్లో స్టామినా పెరిగి కండరాలు అభివృద్ధి చెంది కోర్టులో చురుకుగా ప్రతి షటిల్ కి పరిగెత్తడానికి వీలు పడుతుందన్నారు. ఇక శారీరక దారుఢ్యంతోపాటు చురుకుదనం అలవడుతుందని శ్రీరాములు వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల పిఎంసి చైర్మన్ తగరంపూడి రమణ, రిటైర్డ్ ఆర్మీ వెంకట్రావు, కోచ్‌లు బి.హారిక, పి.మౌనిక, యోగ కోచ్ కళ్యాణి, క్రీడాకారులు పాల్గొన్నారు.

పేదలందరికీ పారదర్శకంగా సంక్షేమ పథకాలు

డిప్యూటీ సీఎం పీడిక రాజన్న దొర

విశాలాంధ్ర - మెంటాడ: అర్హతే ప్రామాణికంగా ప్రజా సంక్షేమమే ధ్యేయంగా అనేక పథకాలు అమలు చేస్తున్నారని అమలుపరిచిన ప్రతి సంక్షేమ పథకం ప్రజలందరికీ చేరాలని ఇంకా ఎవరైనా ఏదైనా కారణాల చేత సంక్షేమ పథకాలు పొందలేకపోతే ఇతరత్రా సమస్యలు ఏమైనా ఉంటే వాటి పరిష్కారానికే గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డిప్యూటీ సీఎం గిరిజన శాఖ మంత్రి పీడిక రాజన్న దొర అన్నారు. శనివారం పెదమేడ పల్లి గ్రామంలో రెండవ రోజు గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమమునకు ముందుగా గ్రామస్తులు రాజన్న దొరను పూలమాలలతో ఘనంగా ఆహ్వానించారు. అనంతరం ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను, అభివృద్ధి పనులను వివరించి ఇంకా ఎవరికైనా ఏ లోపం చేత నైనా సంక్షేమ పథకాలు అందకపోతే తెలియజేయాలని కోరారు. పలువురు ఆయన దృష్టికి తీసుకువచ్చిన చిన్న చిన్న సమస్యలను అక్కడికక్కడే వివిధ శాఖల అధికారుల ద్వారా పరిష్కరించారు. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా అహర్నిశలు శ్రమిస్తున్న సీఎం జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వాన్ని వచ్చే ఎన్నికలలోను అధికారంలోకి తీసుకురావాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రెడ్డి సన్యాసినాయుడు, వైస్ ఎంపీపీ సారికి ఈశ్వరరావు, జడ్పిటిసి ప్రతినిధి లెంక రత్నాకర్ నాయుడు, గ్రామ సర్పంచ్ బోనేల ప్రకాశమ్మ, వైస్ సర్పంచ్, సీనియర్ నాయకులు పోరిపిరెడ్డి (మయూరి) అప్పలనాయుడు, వైసీపీ నాయకులు చొక్కాకు సన్యాసి నాయుడు, మరడ సింహాచలం, మండల ఎస్సీ సెల్ కన్వీనర్ వడ్డి జనార్ధన్, ఎస్సీ, ఎస్టీ ఐక్యవేదిక జిల్లా అధ్యక్షులు వడ్డి చిన్నారావు, మండల సచివాలయ కన్వీనర్ కనిమెరక త్రినాథ్, వైసీపీ జిల్లా కార్యదర్శి దగ్గు దేవుడు, బొడ్డు బుచ్చియ్య, రెడ్డి రాజప్పల్ నాయుడు, బాయి అప్పారావు, ఎంపీడీవో త్రివిక్రమరావు, హౌసింగ్ ఏఈ డేవిడ్ రాజ్, ఏపీఎం జి.దేవుడు, దాట్ల హనుమంత రాజు, వివిధ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, ప్రజా ప్రతినిధులు, వైసిపి సీనియర్ నాయకులు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

చుక్కల భూములపై ప్రభుత్వ నిర్ణయం చారిత్రాత్మకం

లోక్‌సత్తా రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి

విశాలాంధ్ర - విజయనగరం క్రైమ్: రాష్ట్రంలో దశాబ్దాల క్రితం నుండి అత్యంత కీలకమైన రైతు సమస్య "చుక్కల భూముల" పై ముఖ్యమంత్రి జగన్ శాశ్వత పరిష్కారం చూపిస్తూ శుక్రవారం నెల్లూరు జిల్లా కావలిలో ప్రకటించడం అభినందనీయమని లోక్‌సత్తా రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి అన్నారు. శనివారం జిల్లా పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి నిర్ణయం రెవెన్యూ విభాగంలో తీసుకువచ్చిన విప్లవాత్మకమైన మార్పుగా అభివర్ణించారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో రాష్ట్రంలో 97,471 రైతు కుటుంబాలకు మేలు జరుగుతుందని, దాదాపుగా 20 వేల కోట్ల రూపాయల విలువ కలిగిన 2,06,171 ఎకరాల చుక్కల భూముల సంపూర్ణ హక్కులు రైతులు పొందగలుగుతారని తెలిపారు. ఇప్పటికే రాష్ట్రంలోని రైతులు రెవెన్యూ అధికారుల చుట్టూ, కోర్టుల చుట్టూ తిరిగి తిరిగి అలసిపోయారని, చుక్కల భూముల విషయంలో ప్రభుత్వమే ప్రథమ ముద్దాయని రెవెన్యూ అధికారులు చేసిన తప్పులకి రైతులు తీవ్రంగా నష్టపోయారని అన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చుక్కల భూముల చిక్కుల శాశ్వత పరిష్కార కార్యక్రమం నిర్వహణకు ప్రతి జిల్లాలో ఒక ప్రత్యేక అధికారిని నియమించకపోతే రైతులు మరలా లంచాలతో దళారుల చేతిలో పడి మోసపోయే అవకాశం ఉంటుందని భీశెట్టి అన్నారు. ఈ సమావేశంలో మాతృభూమి సేవా సంఘం కార్యదర్శి ఇప్పలవలస గోపాలరావు పాల్గొన్నారు.

బ్రిజ్ భూషణ్ సింగ్‌ని అరెస్ట్ చేయాలి

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: శనివారం ఎస్ ఎఫ్ ఐ, డి వై ఎఫ్ ఐ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ మినిస్టీరియల్ హాల్‌లో రౌండ్ టేబుల్ సమావేశం ఎస్ ఎఫ్ ఐ జిల్లా అధ్యక్షులు సీహెచ్.వెంకటేష్ అధ్యక్షతన నిర్వహించారు. రౌండ్ టేబుల్ సమావేశం తీర్మానం డి వై ఎఫ్ ఐ జిల్లా కార్యదర్శి రుద్రప్రసాద్ ప్రవేశ పెట్టారు. ఈ సందర్భంగా రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు మాట్లాడుతూ దేశం గర్వించదగ్గ క్రీడాకారులైన ఒలింపిక్స్‌లో ఎన్నో పతకాలు సాధించిన రెజ్లర్లు గత 21 రోజులుగా ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద ఆందోళన చేస్తున్నారన్నారు. లైంగిక వేధింపులకు పాల్పడిన బిజెపి ఎంపి రెజ్లింగ్ ఫెడరేషన్ అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌పై చర్యలు తీసుకోవాలని, ఒకప్పుడు మెడల్స్ సాధించినప్పుడు వారి గెలుపును బీజేపీ ప్రభుత్వం ప్రచారం చేసుకుంటున్నారన్నారు. ఇప్పుడు అదే విజేతలు పోరాడుతుంటే ఎవరు పట్టించుకోవడం లేదన్నారు. బ్రిజ్ భూషణ్ శరన్ సింగ్‌పై పోక్సో కేసు చట్టం క్రింద కేసు పెట్టినప్పటికే కేవలం తన పార్టీ, ఎంపీ కావడంతో ప్రధానమంత్రి నోరు మెదపకపోవడం బాధాకరం అన్నారు. ప్రపంచ ప్రఖ్యాతులుగా పేరు సంపాదించనున్న రెజ్లర్లకు అన్యాయం జరిగినప్పుడు స్పందించని బిజెపి ప్రభుత్వం సామాన్య మహిళలకు రక్షణ కల్పిస్తుందా లేదా అనే దాన్ని మనం ఆలోచించాలన్నారు. ఎంపీపై చర్యలు తీసుకోవాలని పోరాడుతున్న రెజ్లర్లకు మద్దతుగా ప్రత్యక్ష పోరాటాల్లో భాగస్వామ్యం కావాలని ప్రజాసంఘాల ప్రతినిధులుగా ప్రజలను కోరడం జరుగుతుంది. రెజ్లర్లకు మద్దతుగా ఈనెల 15న ఒక రోజు నిరసన దీక్ష, 18 న ఆలిండియా పిలుపులో భాగంగా జిల్లా వ్యాప్త నిరసన కార్యక్రమాలు, 20 న2 రన్ కార్యక్రమాలకు రౌండ్ టేబుల్ పిలుపిచ్చింది. ఈ కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయ సంఘం జిల్లా కార్యదర్శి సన్యాసి నాయుడు, కాంగ్రెస్ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు సతీష్, యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈశ్వర్రావు, తిరుపతినాయుడు, ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు రాంబాబు, సీఐటీయూ నగర కార్యదర్శి రమణ, ఐద్వా నాయకులు జగదాంబ, ఎస్ ఎఫ్ ఐ కేంద్ర కమిటీ సభ్యురాలు సీహెచ్.పావని, గురజాడ విజ్ఞాన కేంద్రం కన్వీనర్ శ్రీనివాసరావు, పట్టణ పౌర సంక్షేమ సంఘ్ జిల్లా కార్యదర్శి రెడ్డి శంకర్రావు, జనవిజ్ఞాన వేదిక నాయకులు నిర్మల , ఎస్ ఎఫ్ ఐ జిల్లా ఉపాధ్యక్షులు రాము, జిల్లా సహాయ కార్యదర్శులు రవి,సౌమ్య, నాయకులు సోమేశ్,సమీరా,లావణ్య,కళ్యాణి, డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు సతీష్, సహాయ కార్యదర్శి నాయుడు,నాయకులు చంద్ర,ఈశ్వర్రావు పాల్గొన్నారు.

గడప-గడపకు ఎమ్మెల్యే కడుబండి

విశాలాంధ్ర - వేపాడ: మండలంలోని వల్లంపూడి గ్రామ సచివాలయం పరిధిలో 194వ రోజు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ మూడేళ్ల కాలంలో అందించిన సంక్షేమ పథకాలను వివరించడంతో పాటు వైసిపి ప్రభుత్వం వచ్చాక కలిగే మేలును వివరించి ప్రభుత్వ పనితీరు గురించి వారిని అడగగా తమకు జగన్ ప్రభుత్వం వచ్చాక చాలా మేలు జరుగుతుందని ఎమ్మెల్యేకి తెలుపగా వారి ఆశీర్వాదములు తీసుకున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు మళ్లీ సీఎం జగన్‌ను ఆశీర్వదించాలని కోరారు. ఆనాడు ప్రజా సంకల్ప పాదయాత్రలో ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు గడిచిన మూడేళ్ల కాలంలో కరోనా వంటి విపత్కర పరిస్థితులను ఎదుర్కొంటూ సంక్షేమ పథకాలు అందజేసిన చరిత్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కే దక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ మూకల కస్తూరి, ఎంపీపీ దొగ్గ సత్య వంతుడు, జెడ్పీటీసీ శానాపతి అప్పారావు, మండల పార్టీ అధ్యక్షులు మమ్ము లూరి జగన్నాథం, వైస్ ఎంపీపీ అడపా ఈశ్వరరావు, స్థానిక సర్పంచ్ రుద్ర అంజిలి, రుద్ర వెంకటరావు, ఎంపీటీసీ సేనాపతి లక్ష్మి, కో-ఆపరేటివ్ మాజీ అధ్యక్షులు గండి శ్రీరామ్మూర్తి, బానాది సర్పంచ్ కర్రీ యశోద, శానాపతి ఈశ్వరరావు, బొడ్డు శ్రీను, ముత్యాల నాయుడు పాల్గొన్నారు.

నేడు హనుమాన్ శోభా యాత్ర

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: ఆదివారం జరిగే హనుమాన్ శోభాయాత్రలో అందరం పాల్గొందామని బిజెపి నార్త్ జోన్ అధ్యక్షులు సుధీర్ అన్నారు. శనివారం పట్టణంలో శ్రీమన్నార్ రాజగోపాల స్వామి ఆలయం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో భారతీయ జనతాపార్టీ నార్త్ జోన్ అధ్యక్షులు ఇమంది సుధీర్ మాట్లాడుతూ హిందూ ధర్మ గొప్పతనము చాటే ప్రక్రియలో దేశ వ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో జరిగే హనుమాన్ శోభా యాత్రలో భాగంగా పట్టణంలో కూడా కోట జంక్షన్ వద్ద ఆదివారం సాయంత్రం 4 గంటలకు ప్రారంభం అయ్యే హనుమాన్ శోభా యాత్రలో భక్తులం అందరం పాల్గొందాం,విజయవంతం చేద్దాం అన్నారు. ఈ సందర్భంగా హిందూ ధర్మ రక్షా సమితి రాష్ట్ర కార్యదర్శి నందివాడ వేణుగోపాల్ రావు మాట్లాడుతూ ఈ శోభా యాత్రలో సుమారు 15 అడుగుల హనుమాన్ విగ్రహం ఏర్పాటు చేశామని అలాగే ప్రముఖ ఆధ్యాత్మిక గురువు రాధా మనోహర్ దాస్ విచ్చేయనున్నారు అని కావున విజయనగరం వివిధ హిందూ ధర్మ సంస్థలు అన్నీ ఈ శోభాయాత్ర లో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి శరగోపం పార్ధసారధి, హిందూ ధర్మ రక్షా సమితి పట్టణ అధ్యక్షులు వారణాశి చిన్ని, రాజ్ కుమార్ హిరావత్, కరణం కొండలరావు, రిక్కా పైడిరాజు, రాము, సిద్దార్థ్ పట్నాయక్, చిన్నా దేవి, సంతోష్ వర్మ, తులసి గీత, ఉదయ్ ఋషి, సురేష్ ముత్యాల నాయుడు, అప్పలరాజు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన 120 కుటుంబాలు

విశాలాంధ్ర - దత్తిరాజేరు: మండల పరిధిలో గల వప్పల లింగాలవలస గ్రామానికి చెందిన వైసీపీకి నుండి శనివారం టీడీపీలోకి 120 కుటుంబాలు మాజీ ఎమ్మెల్యే కేఏ నాయుడు సమక్షంలో చేరారు. కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి రావడం ఖాయమని అన్నారు. మరలా అధికారంలోకి వస్తేనే ప్రజల జీవితాలు బాగుపడతాయనే నమ్మకంతో పార్టీలో చేరిన ప్రతి ఒక్క కుటుంబానికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు పివివి గోపాలరాజు, మండల పార్టీ అధ్యక్షులు పెద్దింటి మోహన్‌రావు, క్లస్టర్ ఇన్చార్జిలు పెద్దింటి జగన్, బి.బంగారునాయుడు, మజ్జి మహేష్, పార్లమెంటు యువత అధ్యక్షులు, వేమలి చైతన్య బాబు, పార్టీ నాయకులు కొండబాబు, రాజు, ఎం.గౌరి నాయుడు, కృష్ణ, తాడ్డి రవి తదితరులు పాల్గొన్నారు.

యువతి ఆత్మహత్యాయత్నం

విశాలాంధ్ర - బెలగాం: తల్లి మందలించిందని యువతి ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన సంఘటన చోటుచేసుకుంది. పార్వతీపురం జిల్లా ఆసుపత్రి ఔట్ పోస్టు పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పార్వతీపురం మండలం చెల్లంవలస గ్రామానికి చెందిన బొద్దల మాధురి ఇంటర్ మొదటి సంవత్సరం చదువుకుంది. తల్లి వరలక్ష్మిని స్నేహితురాలికి పుట్టినరోజు కానుకను ఎందుకు అంత ఎక్కువ రేటుకు కొన్నావు ఎవరికిపడితే వారికి డబ్బులు పెట్టి గిఫ్ట్‌లు కొంటున్నావు డబ్బులు ఎలా వస్తాయని మందలించడంతో మనస్తాపం చెంది కోపగించుకొని తన చేతిలో వున్న సెల్ ఫోన్‌ను క్రిందకి విసరికొట్టడంతో వరలక్ష్మి మరింత కోపగించుకుంది. దీనితో మనస్తాపం చెంది తన మామయ్య థైరాయిడ్‌కు వాడే మందులు ఇంటిలో ఉంటే వాటిలో 15 మాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన ఆమె తల్లి వెంటనే చుట్టు ప్రక్కలవారిని పిలిచి కక్కించడానికి ప్రయత్నం చేసారు కాని అవలేదు. తరువాత పార్వతీపురం జిల్లా ఆసుపత్రికి తీసుకొని రాగా వైద్యులు చికిత్స అందించారు. ఔట్ పోస్టు పోలీసులు వివరాలు నమోదు చేసినట్లు తెలిపారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

విశాలాంధ్ర - బెలగాం : తోడికోడలు, ఆమె కొడుకు దాడి చేసి కొట్టడంతో భర్త చూసి అడగలేదని మహిళ ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన సంఘటన చోటుచేసుకుంది. పార్వతీపురం జిల్లా ఆసుపత్రి ఔట్ పోస్టు పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సీతానగరం మండలం గెద్దలుప్పి గ్రామానికి చెందిన రొంపిల్లి గౌరీశ్వరి వ్యవసాయ కూలి. పెళ్లయి 8.సం లయింది. ఇద్దరు పిల్లలు. తన భర్తను పని లేక ఏదో ఒక ప్రయత్నం చేసుకోమని అడుగగా ఆ విషయమై భార్యభర్తలిద్దరూ గొడవపడగా తోడికోడలైన రొంపిల్లి సత్యవతి, ఆమె కుమారుడు దినేష్‌లు కలుగుచేసుకొని దిశేష్ మా చిన్నాన్నని బాధపెడతావే అని పీక పట్టుకోగా తల్లికొడుకులు దాడి చేసి కొట్టారు. తన భర్త అడ్డుపడలేదు అడగలేదు. దీనితో మనస్థాపం చెంది ఇంటిలో ఉన్న చీమల మందు నెయిల్ పాలిష్ కలిపి తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడింది. గమనించిన ఆమె భర్త 108 వాహనం ద్వారా పార్వతీపురం జిల్లా ఆసుపత్రికి తీసుకుని రాగా వైద్యులు చికిత్స అందించారు. ఔట్ పోస్టు పోలీసులు వివరాలు నమోదు చేసినట్లు తెలిపారు.

మాతృ దినోత్సవ వేడుకలు

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: ఇందిరా ప్రియదర్శిని వాకర్స్ క్లబ్ అధ్యక్షులు గంటి కోట శాంతి ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాతృ దినోత్సవ వేడుకలను స్థానిక ఉడా కాలనీలో నిర్వహించారు. ముందుగా కాలనీలో ఎటువంటి సహాయం చేయాలన్న, సమస్య వచ్చినా ముందుండే బుద్ధరాజు సీతాదేవికి సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గండికోట శాంతి మాట్లాడుతూ మాతృదేవోభవ అంతర్జాతీయ మాతృ దినోత్సవ శు భాకాంక్షలు తెలియజేశారు. మనకు జన్మనిచ్చిన మాతృమూర్తికి పాదాభివంద నములు చేస్తూ మాతృదేవోభవ ఒక శ్రీమూర్తి పరిపూర్ణత మాతృమూర్తి వలనే వస్తుందని మన పురాణాలు కూడా ముందుగా ముగ్గురమ్మలగన్న మూలపుటమ్మ అని ఆ ఆదిపరాశక్తిని అని తెలిపారు అన్నారు. గణేష్ మహరాజ్ కూడా ముందుగా తల్లితండ్రులకు ప్రదక్షణ చేయగా ఆయన ఆయనకి భూప్రదక్షిణ చేసిన ఫలితం వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో సభ్యులు జ్యోతి, కళ, మహాలక్ష్మి, మహేశ్వరి, అశ్విని, లిపికా పద్మ, తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటకలో కాంగ్రెస్ గెలుపు..దేశ అభివృద్ధికి నాంది

విశాలాంధ్ర - శృంగవరపుకోట : కర్ణాటకలో కాంగ్రెస్ గెలుపు..మన దేశ అభివృద్ధికి నాంది అని శృంగవరపుకోట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు జి.బంగారు నాయుడు అన్నారు. కర్ణాటక రాష్ట్రంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అత్యధిక స్థానాలలో విజయం సాధించడంతో శృంగవరపుకోట మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు జి.బంగారు నాయుడు ఆధ్వర్యంలో పట్టణంలోని దేవి కూడలిలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు శనివారం బాణాసంచా కాల్చి, మిఠాయిలను తినిపించుకుని సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా జి.బంగారు నాయుడు మాట్లాడుతూ కర్ణాటక రాష్ట్ర ప్రజల వలనే దేశ ప్రజలు కూడా భారతీయ జనతా పార్టీపై విసిగిపోయి ఉన్నారని, 2024 ఎన్నికల్లో మతతత్వ బీజేపీకి దేశ ప్రజలు గుణపాఠం చెప్తారని తద్వారా కాంగ్రెస్ పార్టీ అధికారాన్ని చేజెక్కించు కుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పి.మణిబాబు, జిల్లా ఎస్టీ సెల్ చైర్మన్ చీమల అచ్చిబాబు, నియోజకవర్గ సమన్వయకర్త నానాజీ, యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీ శ్రీనివాసరావు, నియోజకవర్గ సమన్వయకర్త మెంటాడ అప్పారావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

విశాలాంధ్ర - తెర్లాం: మండలంలోని నందిగాం గ్రామానికి చెందిన తెర్లి గిరీష్ కుమార్ అక్రమ మద్యం బాటిల్స్ తరలిస్తుండగా ఎస్ఐ రమేష్ అరెస్ట్ చేశారు. విజయనగరం జిల్లా ఎస్పీ ఎం దీపిక ఆదేశాలు మేరకు అక్రమంగా మద్యం అమ్మకాలు చేస్తున్న వారిపై శనివారం మెరుపు దాడి చేశారు. తెర్లాం మండలంలోని శుక్రవారం ఒక వ్యక్తిని అరెస్ట్ చేయగా శనివారం నందిగాం గ్రామానికి చెందిన వ్యక్తి 107 అక్రమ మద్యం బాటిళ్లు రవాణా చేస్తున్న వ్యక్తిని పట్టుకుని అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ ఆర్.రమేష్, వారి సిబ్బంది హెచ్‌సి ప్రసాద్, రమణ రాజు పాల్గొన్నారు.

మండల పరిషత్ ఓఎస్ మృతి

విశాలాంధ్ర - కురుపాం: కురుపాం మండల ప్రజా పరిషత్ కురుపాం కార్యాలయంలో ఆఫీస్ సబ్-ఆర్డినేట్‌గా పనిచేస్తున్న వి.సత్యన్నారాయణ అనారోగ్యంతో మృతి చెందారు. ఈ మేరకు ఆయన మృతి పట్ల ఎంపీడీఓ వివి శివరామప్ప, మండల పరిషత్ సిబ్బంది, ఎంపీపీ పద్మావతిలు సంతాపం వ్యక్తం చేశారు.

పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకోవాలి

విశాలాంధ్ర - తెర్లాం: విద్యార్థులు పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకోవాలని తెర్లాం 5 అంగన్వాడీ టీచర్ వై.శ్రీదేవి అన్నారు. స్థానిక శాఖ గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరం సందర్భంగా పుస్తక పఠనం వల్ల కలిగే ప్రయోజనాలు విద్యార్థినీ, విద్యార్థులకు వివరించారు. గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకుని విజ్ఞానం పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి సీహెచ్ కృష్ణమూర్తి పాల్గొన్నారు.

ఏనుగుల సమస్యకు పరిష్కారం లేదా?

కావాలనే తాత్సారం

రాత్రివేళలో కనిపించని అటవీశాఖ అధికారులు, ట్రాకర్లు...

నష్టపరిహారం ఇవ్వడంలో కూడా జాప్యమే...

కాగితాలకే పరిమితమైన తరలింపు ప్రతిపాదనలు...

ఇంతవరకు 11 మంది మనుషులను పొట్టన పెట్టుకున్న ఏనుగులగుంపు...

వివిధప్రాంతాల్లో మృతిచెందిన 11 ఏనుగులు...

విశాలాంధ్ర - పార్వతీపురం: పార్వతీపురం, పాలకొండ రెవెన్యూ డివిజన్ పరిధిలో గత ఏడేళ్ల నుండి ఏనుగుల గుంపురాకతో ప్రజలు, రైతుల ఇబ్బందులు పడుతున్న ఇబ్బందులు నరకనమని చెప్పవచ్చు. ఏదో ఒక సంఘటన జరిగినప్పుడు అధికారులు, ప్రజాప్రతినిధులు పత్రికా ప్రకటనలతో ఏదో ఒకటి చెబుతున్నారు తప్ప వాటిని తరలించే చర్యలు తీసుకోవడం లేదు.పార్వతీపురం కొత్త జిల్లాను ఏర్పాటు చేసిన ప్రభుత్వం దానికి పార్వతీపురం మన్యం జిల్లాఅని పేరు పెట్టింది ఏనుగులను శాశ్వతంగా ఉంచేందుకని స్పష్టంగా తెలుస్తోంది.అటువంటప్పుడు ఆదిశగా ఏనుగులగుంపు ఉండేందుకు తగు చర్యలు తీసుకున్నా మంచిదే. ఇక్కడ నుండి ఇప్పటికే ఎక్కువ మంది ఉపాధి కోసం వలసలు వెళ్తున్నసంగతి తెలిసిందే కదా. ఏనుగుల గుంపు కోసం ఇక్కడే ఉండేలా శాశ్వత చర్యలు తీసుకుంటే మిగిలిన జనాలు వలసలు వెళ్లిపోతామని వాటివల్ల నిత్యం నష్టాన్ని చవిచూస్తున్న దలాయిపేట, వన్నాం, కోదులగుంప, మాద లింగి, తొడుము ఇలా దాదాపు వంద గ్రామాల ప్రజలు అంటున్నారు. దళాయి పేటకు చెందిన నిరుపేదరైతు రమణయ్య తన అవేదన వ్యక్తంచేస్తూ ఏనుగుల గుంపు వల్ల పంట నష్టపరిహారం గూర్చి కంటే తనకు చెందిన మూడు ఆవులను చంపాయని,గురువారం రాత్రి మరో ఆవుకు గాయపర్చాయని అవేదన వ్యక్తం చేశారు. ఈగ్రామాల్లోని రైతులు తమ మాటల్లో ప్రభుత్వం ఉందా అని కూడా ప్రశ్నిస్తున్నారు. ఉదయం ఉండే అటవీ శాఖ దిగువస్థాయి అధికారులు చీకటి పడితే వారొకదగ్గర, ఏనుగులు ఒక దగ్గర నుండి రాత్రిపూట అవి నడుస్తూ పంటలకు తీవ్ర నష్టాన్ని గురిచేస్తాయని చెప్పారు. ఎంతో మంది రైతుల బోర్లు,మోటార్లు, పొలాల్లో ఉండే సామాగ్రిని ధ్వంసం చేశాయని చెప్పారు. మొక్కజొన్న, అరటి,పామాయిల్, అరటి తదితర వాణిజ్య పంటలసాగును తీవ్రంగా నష్టం జరుగుతున్న వారికి రావల్సిన నష్టపరిహారం అంచనాలో, పంపిణీలోతీవ్ర జాప్యం ఉంటుందని వారు చెబుతున్నారు.2017లో ఏనుగుల గుంపు పార్వతీపురం రెవెన్యూ డివిజన్ లో అడుగుపెట్టగ, ఏడాది క్రితం పాలకొండ రెవెన్యూ డివిజన్ లో మరో గుంపు అడుగు పెట్టాయి. వీటితో ఇంతవరకు 11మంది మనుష్యులు చనిపోగా, దాదాపు వివిద సందర్భాల్లో 11ఏనుగులు కూడా మృత్యువాత పడిన సంగతి తెలిసిందే.శుక్రవారం భామిని దగ్గర కాట్ర గడ్డ దగ్గర విద్యుత్ఘాటానికి గురై ఒకేసరి నాలుగు ఏనుగుల మృతి జిల్లా ప్రజలను తీవ్రంగా కలచివేసింది. వాటివల్ల నష్టం జరిగిన ఒకేదపా నాలుగు ఏనుగుల మృతిని జీర్ణించుకోలేక జిల్లాలోని ప్రజా ప్రతినిదులపైన, అధికారులపైన ప్రజలు శాపనార్ధాలు పెడుతున్నారు. గజరాజుల మృతి జిల్లాకు నష్టంతెచ్చి పెడుతుందని పలువురు వృద్ధులు చెప్పడం గమనార్హం.

ప్రస్తుతం జనంలో ఉన్న ఏనుగులగుంపు పరిస్థితి చూస్తే జాలేస్తుంది. ఇటీవల

వన్నాం గ్రామంలో దాహార్తిని తీర్చేందుకు ఒక ఏనుగు అక్కడ ప్రజలుఉన్న బోర్ దగ్గరికి వచ్చి బోరును కొట్టుకొని నీటిని త్రాగడం అందరినీ ఆశ్చర్య పరిచింది. తోటలులేక గంటల తరబడి రాత్రి పూట ప్రయాణాలు చేస్తూ పంటలను ధ్వంసం చేస్తున్నాయి. మరో వైపు మన్యం జిల్లాలో మంచి వాతావరణం, నదులతోపాటు పచ్చని పంటలు ఉండటంతో వాటికీ ఆహారం బాగా ఉండటమే కాకుండా వాటిని కామధేనువుగా అటవీశాఖ అధికారులు భావిస్తున్నవేళ వాటికి వెళ్లాల్సిన అవసరం లేదని ప్రజల గుసగుసలు వినిపిస్తున్నాయి. ఏదో సంఘటన జరిగిన వెంటనే రాష్ట్ర,జోన్, జిల్లా అధికారులు విచ్చేసి రకరకాల మాటలు చెప్పి తిరిగి వెళ్లిపోవడం తప్ప తరలించాలన్న ఆలోచన లేదని స్పష్టంగా కనిపిస్తుంది.ఏనుగుల గుంపు వచ్చిన తరువాత వాటిని తరలించే చర్యలు తీసుకోవడం జరుగుతుందని, ప్రతిపాదనలు పంపామని చెప్పడం తప్ప ఆచరణలో ఇంతవరకు జరగలేదని ప్రజలు, రైతులు,ప్రజాసంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.పార్వతీపురంకు దగ్గరలో జంతికొండ వద్ద ఎలిఫెంట్ జోన్ కు ప్రతిపాదనలు, ఏనుగులను శాశ్వతంగా తరలింపు చేస్తామని చెప్పిన ప్రజా ప్రతినిధులు, అధికారుల మాటలు అమలు జరగలేదు. అటవీశాఖ అధికారుల తీరుపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. సాధారణంగా పంటనష్టపరిహారం ఏర్పడితే వ్యవసాయశాఖ అధికారులు సత్వరమే స్పందించి సకాలంలో నష్ట పరిహారం అందేలా చర్యలు తీసుకొంటున్నారు. ఏనుగుల వల్ల కలిగే పంటల నష్టపరిహారం వ్యవసాయ, ఇతర శాఖల అధికారులు అంచనావేసి అటవీ శాఖ అధికారులకు పంపడం తప్ప పరిహారం రావడంలేదని రైతులు లబో దిబో మంటున్నారు. ఏనుగుల వల్ల జరుగుతున్న నష్ట పరిహారం కోసం స్పందనలో పిర్యాదులు తప్ప పరిష్కారం జరగడం లేదని పలువురు తెలిపారు.

పార్వతీపురం మన్యం జిల్లాలోని ఉన్న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, మాజీ ఉప ముఖ్యమంత్రి(కురుపాం ఎమ్మెల్యే) పాలకొండ, పార్వతీపురం ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్,పార్వతీపురం, సీతమ్మపేట ఐటీడిఏ ప్రోజెక్టు అధికారులు, అటవీశాఖ అధికారులు, పోలీస్ అధికారులు దీనిపై దృష్టి సారించి వాటిని మన్యంజిల్లానుండి తరలించే చర్యలు తీసుకోవాలని జిల్లా ప్రజానీకం, రైతులు, ప్రజాసంఘాలు విజ్ఞప్తి చేస్తున్నారు. దాంతోపాటు వాటివల్ల ఇంతవరకు జరిగిన నష్టపరిహారం ఇంకా ఎంత చెళ్ళింపులు జరగాలన్నది సమీక్ష చేసి చెల్లింపులు త్వరితగతిన జరిగేలా తగు చర్యలు తీసుకోవాలని వారంతా కోరుతున్నారు. వెనుకబడిన మన్యం జిల్లాలో ఏనుగుల సమస్య, వాటి వల్ల జరిగిన నష్టపరిహారం సమస్య పరిష్కారం చేయడానికి వారంతా సత్వరమే కూర్చొని తగు చర్యలు తీసుకుంటారని ఎదురు చూద్దాంమరీ...

ఏనుగులను శాశ్వతంగా తరలించాలి: సీపీఐ

మన్యంజిల్లాలో భామినికి దగ్గరలో ఒకే చోట విద్యుత్ఘానికి గురై నాలుగు ఏనుగుల మృతి చెందిన సంఘటన తీవ్రంగా కలచివేసిందని సీపీఐ మన్యంజిల్లా కార్యదర్శి కూరంగి మన్మథరావు, జిల్లా సహాయ కార్యదర్శి తోటజీవన్న, జిల్లా కార్యవర్గ సభ్యులు గరుగుబిల్లి సూరయ్య ,కుండంగి లింగరాజు, జిల్లా సమితి సభ్యులు పువ్వుల ప్రసాద్, పత్తిక మోహనరావులతో పాటు జిల్లా రైతు సంఘం ప్రధాన కార్యదర్శి బుడితి అప్పల నాయుడులు తెలిపారు. సంఘటన జరిగిన ప్రాంతాన్ని వారు సందర్శన చేసామని తెలిపారు. నిర్లక్ష్య వైఖరి వల్లనే సంఘటన జరిగిందన్నారు. తక్షణమే మన్యం జిల్లాలో ఇటు పార్వతీపురం, అటు పాలకొండ ప్రాంతాల్లో ఉండే ఏనుగుల గుంపులను శాశ్వతంగా తరలించే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైతులకు అందాల్సిన నష్ట పరిహారంనుకూడా తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు.ఇంతవరకు ఎంత చెల్లింపు చేశారు, ఇంకా ఎంత చెల్లింపు చేయాలన్నదానిపై అటవీ అధికారులు ఒక ప్రకటన విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గజరాజుల వల్ల జరిగిన నష్టం ప్రక్కన పెడితే వాటిని ఇప్పటికైనా తక్షణమే ఇక్కడ నుండి తరలించే చర్యలు తీసుకోవాలని రెండు చేతులతో అధికారులని ప్రాధేయ పడుతున్నట్లు పలువురు వయస్సుపైబడిన వారు చెప్పడం గమనార్హం. ఏనుగుల వల్ల 11మంది మనుష్యులు చనిపోవడం కంటే, 11ఏనుగులు చనిపోవడం తీవ్రంగా కలచివేస్తుందని, ఇది జిల్లాకు శుభం కాదని వారు కన్నీళ్లపెట్టుకొని చెప్పడం ఆశ్చర్య పరిచింది.

ఏకగ్రీవ పంచాయతీలపై చిన్నచూపు

విశాలాంధ్ర - తెర్లాం/బాడంగి: ఏకగ్రీవ పంచాయితీలపై ప్రభుత్వం చిన్నచూపు చూస్తుందని ఆలులకట్ట సర్పంచ్ ఉయ్యాల సత్యన్నారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. తాను ఏకగ్రీవంగా ఎన్నికయ్యానని ప్రభుత్వం నుంచి 5 లక్షలు పారితోషకం రావాలన్నారు. రెండేళ్లు దాటిన నిధులు మంజూరు కాక అభివృద్ధి పనులు జరగడం లేదని వాపోయారు. ఇప్పటికయినా ప్రభుత్వం దృష్టి సారించింది నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

రైల్వే స్టేషన్‌లో ప్రత్యేక తనిఖీలు

విశాలాంధ్ర - బొబ్బిలి: స్థానిక స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో సీఐ ఆర్. జైభీమ్ ఆధ్వర్యంలో సిబ్బంది నిషేధిత గంజాయి ఇతర మత్తు పదార్థాలు అక్రమ రవాణా నిరోధించడానికి శనివారం రైల్వేస్టేషన్ లో ప్రయాణికుల సామాగ్రి ను తనిఖీ లు చేపట్టారు. ఎవరూ గంజాయి ఇతర డ్రగ్స్ లాంటి నిషేధిత పదార్థాలు రవాణా చేయకుండా నిరోదించేందుకు ప్రయాణికుల సామాగ్రి ని క్షుణ్ణంగా తనిఖీ చేయడం జరిగిందని ఇటువంటి తనిఖీ లకు ప్రయాణికులందరు స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో శాఖ సిబ్బందికి తనిఖీ లో సహకరించాలని సీ.ఐ. జైభీమ్ కోరారు. నేటి యువత యువకులంతా జీవితాలను నాశనం చేస్తున్న గంజాయి, ఇతర మత్తు పదార్థాలు జోలిన పడవద్దని విద్య పైన ప్రత్యేక దృష్టి సారించి వివిధ పోటీ పరీక్షల్లో మంచి ఉద్యోగాలు సాధించి కుటుంబానికి మంచి పేరు ప్రత్యేక తీసుకురావాలని పిలుపునిచ్చారు. గంజాయి నాటు సారా, ఇతర మత్తు పదార్థాలు ఎంత ప్రమాదకరమో ప్రయాణికులకు అవగాహన కల్పించారు. గంజాయి ఇతర మత్తు పదార్థాలు అక్రమ రవాణకు పాల్పడి విలువైన జీవితాలను జైలు పాలు కావద్దని కోరారు.

కొత్తవలస కోర్టులో జాతీయ లోక్ అదాలత్

విశాలాంధ్ర - వేపాడ/కొత్తవలస: నియోజక వర్గంలోని కొత్తవలస జూనియర్ సివిల్ కోర్టులో జాతీయ లోక్ అదాలత్‌ను జూనియర్ సివిల్ జడ్జి ఎస్.విజయ్ చంద్ర శనివారం నిర్వహిం చారు. ఈ లోక్ అదాలత్‌లో 11 ఎక్సైజ్ కేసులు, 9 పోలీసు కేసులు, 4 సివిల్ కేసులు,725 పెట్టి కేసులు, ఒక ఎన్.ఐ యాక్ట్ కేసులను రాజీ చేశారు. ఈ లోక్ అదాలత్‌లో వేపాడ, లక్కవరపుకోట, కొత్త వలస మండలాలకు చెందిన ఎక్సైజ్, సివిల్ పోలీసులు కోర్టు సిబ్బంది పలువురు న్యాయవాదులు, కక్షిదారులు తదితరులు పాల్గొన్నారు.

చిన్న చిన్న తగాదాలతో కుటుంబాలు విచ్ఛిన్నం కారాదు

జిల్లా జడ్జి బి.సాయి కళ్యాణ్ చక్రవర్తి

విశాలాంధ్ర - విజయనగరం క్రైమ్: చిన్న చిన్న తగాదాలతో కుటుంబాలు విచ్ఛిన్నం కారాదని, కుటుంబ సభ్యులు పట్టింపులకు పోయి కలహాలతో చక్కని జీవితాలను పాడుచేసుకొంటున్నారని, వీటిని మనమే సరిదిద్దుకోవాలని అప్పుడే వ్యక్తుల మధ్య సంబంధ బాంధవ్యాలు పెరుగుతాయని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి బి.సాయి కళ్యాణ చక్రవర్తి స్పష్టం చేశారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి మాట్లాడుతూ ఈ మధ్య కాలంలో కుటుంబ తగాదాలు ఎక్కువగా పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అనవసర కలహాలుమాని పిల్లల భవిష్యత్ కోసం, మనమీద ఆధార పడ్డవారికోసం అహం వీడి రాజీకి రావాలని సూచించారు. సృష్టిలో ఏ ఒక్కరూ పరిపూర్ణులు కాదని తెలుసుకోవాలని, లోపాలను విస్మరిస్తే అందమైన జీవితాలను మనమే తయారు చేసుకోవచ్చు అని అన్నారు. క్షనీకావేశములో మరియు ప్రతి ఫలానికి ఆశించి నేరాలకు అలవాటు పడరాదని చెప్పిరి కేసులకోసం పోలీస్ స్టేషన్స్, కోర్టుల చుట్టూ తిరిగి సమయాన్ని డబ్బు వృధా చేసుకోవద్దని హితవు పలికారు. జాతీయ లోక్ అదాలత్ లో కేసులను పరిష్కరించుకుంటే కేసులకు శాశ్వత పరిస్కారం లభిస్తుందని చెప్పారు. ఈ జాతీయ లోక్ అదాలత్ లో మొత్తం సివిల్ మరియు పరిష్కరించదగిన క్రిమినల్ కేసులను పరిష్కరించడం జరిగిందని ఈ రోజు విజయనగరం మరియి పార్వతీపురం మన్యం జిల్లాలలోని వున్నా కోర్టులయిన విజయనగరం, పార్వతీపురం, బొబ్బిలి, సాలూరు,శృంగవరపుకోట, గజపతినగరం, చీపురుపల్లి, కొత్తవలస, కురుపాం, మొదలైన కోర్టులలో, జిల్లాల వ్యాప్తంగా మొత్తం 10,613 కేసులను పరిష్కరించడం జరిగిందని జిల్లా ప్రధాన న్యాయ మూర్తి తెలిపారు.

ఈ జాతీయ లోక్ అదాలత్ లో పరిష్కరించిన కేసులు విజయనగరం 3028, పార్వతీపురం 1641, బొబ్బిలి 1447, సాలూరు 1012, శృంగవరపుకోట 418, గజపతినగరం 1066, చీపురుపల్లి 1068, కొత్తవలస 803, కురుపాం 130, మొత్తం కేసులు 10613 పరిష్కరించారు. ఈ జాతీయ లోక్ అదాలత్ లో అధిక సంఖ్య లో అనగా 59 మోటార్ ప్రమాదభీమా కేసులను పరిష్కరించడం జరిగినది. కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి, చైర్మన్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ జి.రజని, మొదటి శ్రేణి జిల్లా న్యాయ మూర్తి ఎస్.కె. సికెందర్ బాషా, ఎస్. సి ఎస్. టి న్యాయ మూర్తి, నాల్గవ శ్రేణి జిల్లా న్యాయమూర్తి ఎమ్. మీనా దేవి, కుటుంబ న్యాయ స్థానం న్యాయమూర్తి, మూడవ శ్రేణి జిల్లా న్యాయ మూర్తి కె. నాగమణి, సీనియర్ సివిల్ జడ్జి, కార్యదర్శి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ బి.హెచ్.వి. లక్ష్మి కుమారి, సీనియర్ సివిల్ జడ్జి ఎల్. దేవి రత్న కుమారి, ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి బి.రమ్య, అడిషనల్ జ్యూడిషల్ మొదటి శ్రేణి న్యాయ మూర్తి కె. మోహిడెన్ జమూరుత్ బేగం తదితరులు పాల్గొన్నారు.కక్షిదారులకు సౌకర్యార్థం మెడికల్ క్యాంపు ఏర్పాటుచేయడం జరిగింది. పంపానా రవి కుమార్, పి.ఎ. ఎన్. రాజు సీనియర్ న్యాయవాదుల సహకారంతో కక్షిదారులకులకు భోజన వసతి కల్పించారు.

జాతీయ లోక్ అదాలత్‌లో 1650 కేసులు పరిష్కారం



విశాలాంధ్ర - బెలగాం: పార్వతీపురం రెండవ అదనపు జిల్లా జడ్జి మండల న్యాయ సేవ కమిటీ చైర్మన్ ఎస్. దామోదరరావు అధ్యక్షతన స్థానిక కోర్టు ప్రాంగణంలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ లో మొత్తం 1650 కేసులు పరిష్కారమయ్యాయి.

వీటిలో రోడ్డు ప్రమాదాల కేసులు 11, సివిల్ కేసులు 19, క్రిమినల్ కేసులు1620, మొత్తం 1650 కేసులుగా రాజీ పరిష్కారం చేయడం జరిగింది. పెండింగ్లో ఉన్న వ్యాజ్యముల పరిష్కారం విలువ మొత్తం రూ.45,00,000 (అక్షరాల నలబై అయిదు లక్షల రూపాయలు) పరిష్కరించబడింది. ఈ సందర్భంగా రెండవ అదనపు జిల్లా జడ్జి ఎస్. దామోదరరావు మాట్లాడుతూ కేసుల తీవ్రతను బట్టి రెగ్యులర్ కోర్టులో వ్యాజ్యం నడిపించవలసిన వచ్చినట్లయితే తగు సలహా ఇవ్వడమే కాక అర్హులైన పేద వారికి ప్రభుత్వం తరపున ఉచితంగా న్యాయవాదిని నియమించటం జరుగుతుందన్నారు.

జాతీయ లోక్ అదాలత్ లో కేసుల పరిష్కారం నిమిత్తం మూడు బెంచ్ లను ఏర్పాటు చేశారు. మొదటి బెంచ్ కు రెండవ అదనపు జిల్లా జడ్జి ఎస్. దామోదరరావు, రెండవ బెంచ్ కు సీనియర్ సివిల్ జడ్జి జి. యజ్ఞనారాయణ, మూడవ బెంచ్ కు అడిషనల్ జ్యూడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ డి. సౌజన్య, న్యాయవాదులు సాంఘిక సేవ వ్యక్తులను నియమించడం జరిగింది.

ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కె. చంద్రకుమార్, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ గొర్లి వెంకట్రావు, బార్ అసోసియేషన్ అధ్యక్షులు నల్ల శ్రీనివాసరావు, సీనియర్ న్యాయవాదులు, బ్యాంకు అధికారులు, కక్షిదారులు పాల్గొన్నారు.

ఆర్టీసీ పార్శిల్ సెంటర్ సందర్శన

విశాలాంధ్ర - వంగరం: మండలంలోని ఆర్టీసీ పార్శిల్ సెంటర్‌ను ఆర్టీసీ అధికారి సందర్శించారు. వంగర నుండి ఆర్టీసీ బస్సుల ద్వారా ఎచ్చటకైననూ పార్శిల్ తరలించటానికి సంబంధించి సెంటర్‌ను ఏర్పాటు చేశామని, దీనిని వినియోగించుకోవాలని పాలకొండ ఆర్‌టీసీ డిపో అసిస్టెంట్ మేనేజర్ లక్ష్మణ రావు చెప్పారు. వంగర పరిసర ప్రాంతంలో గల ప్రజలందరూ ఏపీఎస్ఆర్టీసీ లాజిస్టిక్స్ సర్వీసులను వినియోగించుకోవాలని కోరారు. ఏపీఎస్ఆర్టీసీ ద్వారా మీ యొక్క పార్సిల్స్ ను, కొరియర్లను ఆంధ్రప్రదేశ్లో ఎక్కడికైనా సత్వరంగా తక్కువ ధరకు సురక్షితంగా చేర్చబడునని తెలిపారు. అలాగే రాష్ట్రంలో ఎక్కడనుండైనా వంగర కూడా మీ పార్సిల్స్ ను, కొరియర్స్ ను బుక్ చేసుకోవచ్చునని చెప్పారు. ఆయన వెంట డ్రైవర్లు తిరుపతి,మల్లేసు ఉన్నారు.